క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందిస్తున్న మంత్రి హరీశ్‌రావు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని ధర్మారంలో ఇటీవల పాత బావిని పూడుస్తున్న క్రమంలో ట్రాక్టర్ ఇంజన్‌తో సహా డ్రైవర్ గూళ్ళ దుర్గయ్య బావిలో పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. అతను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ అస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. డ్రైవర్ దుర్గయ్యకు మరింత మెరుగైన వైద్యాన్ని అందించాలని అక్కడి డాక్టర్లను ఆదేశించారు. డ్రైవర్ కుటుంబ సభ్యులకు రూ.2.50 లక్షల ఎల్ ఓసీని శనివారం ఆందించారు.

ఆకట్టుకున్న మోడల్స్ ప్రదర్శన



స్టోర్‌లో బ్రైడల్ జ్యువెలరీతో మోడల్స్

సిద్దిపేటజోన్: ప్రముఖ మలబార్ గోల్డ్ డైమండ్ స్థానిక షోరూమ్‌లో శనివారం సాయంత్రం బ్రైడల్ ఆఫ్ ఇండియాలో భాగంగా కొత్త కొత్త ఆభరణాలను ప్రదర్శించారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వధూవరులకు అనుగుణంగా ఉండే జ్యువెలరీని అందుబాటులోకి తెచ్చారు. అందులో భాగంగానే సిద్దిపేట స్టోర్‌లో మోడల్స్ నూతన ఆకర్షణీయమైన ఆభరణాలు ధరించి ప్రచారం చేశారు. కార్యక్రమంలో స్టోర్ ఇన్‌చార్జ్ ఇర్ఫాన్, సిబ్బంది వాజిద్, శివ మోడల్స్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలో గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కారోబార్లు, సిబ్బంది తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ విధులు బహిష్కరించి మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మె శనివారం రెండోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న సిబ్బంది అందరికీ జీవో నం 51ను సవరించి కేటగిరీల వారీగా (కారోబార్, సఫాయి, పంపు ఆపరేటర్, ఎలక్ట్రీషియన్, ట్రాక్టర్ డ్రైవర్) హోదా కల్పించి కనీస వేతనం రూ.15,500లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత

దుబ్బాకటౌన్: పట్టణంలోని 18వ వార్డులో గల వీరాంజనేయ ఆలయ అభివృద్ధికి మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిల సహకారంతో కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అన్నారు. శనివారం ఆలయం వద్ద రూ.10లక్షలతో చేపట్టనున్న ప్రహరీ నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గోనె మధు, ఆలయ కమిటీ బాధ్యులు తదితరులు ఉన్నారు.

ఘనంగా చౌడలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పెద్దపట్నంలో పూజలు చేస్తున్న డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి దంపతులు

కొండపాక(గజ్వేల్): మండలంలోని దమ్మక్కపల్లి గ్రామంలో జరుగుతున్న చౌడలమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి దంపతులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. చౌడలమ్మ విగ్రహ దాతగా నిలిచిన చిట్టి మాధురీరెడ్డి ఒడిబియ్యం పసుపు, కుంకుమ, గాజులను సమర్పించుకొని కుటుంబాన్ని చల్లగా చూడాలని వేడుకున్నారు.

దుకాణాలకు బహిరంగ వేలం

దుబ్బాకటౌన్: పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ల్లోని దుకాణాలకు శనివారం చైర్‌పర్సన్ గన్నె వనితా భూంరెడ్డి, కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డిల ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని శాస్త్రీ విగ్రహం వద్ద శాపింగ్ కాంప్లెక్స్‌లో ఒకటి, డబుల్ బెడ్రూంల వద్ద ఒకటి, అంగడి బజార్‌లో మిగిలిన ఒక దుకాణాన్ని బహిరంగ వేలం ద్వారా ముగ్గురికి కేటాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మిగిలిన దుకాణాలను రిజర్వేషన్ల వారీగా మరోసారి వేలం వేసేందుకు త్వరలోనే ప్రకటన జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ప్రవీణ్, రామస్వామి, మధుసూదన్ తదితరులు ఉన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



జగదేవ్‌పూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రతాప్‌రెడ్డి



మంగోల్‌లో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి తదితరులు

● ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కుకునూరుపల్లి, మంగోల్, లకుడారం, కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, ఆరెపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం రైతుబంధు సమితీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుగు దేవి రవీందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్‌తో కలిసి వారు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పొల్కంపల్లి జయంతి, పుల్లోజు కిరణ్‌కుమార్‌చారి, కందూరి కనుకవ్వ, మల్లుమారి రవీందర్, అమ్ముల రమేశ్, ఎంపీటీసీలు హరితారెడ్డి, భూములుగౌడ్, డైరెక్టర్లు నర్సింహ్మాచారి, కనకయ్య, శంకర్, సురేందర్‌రావు, భాస్కర్, రైతుబంధు జిల్లా కమిటీ సభ్యుడు ఎల్లం, మండల కో–ఆర్డినేటర్ దుర్గయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ధర్మారం, పీర్లపల్లి, జగదేవ్‌పూర్, మందాపూర్, దౌలాపూర్, చాట్లపల్లి, వట్టిపల్లి, తిగుల్ నర్సాపూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం కొండపోచమ్మ ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీపీ బాలేషంగౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రంగారెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని చెప్యాల, మిరుదొడ్డి, కాసులాబాద్, అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంతో పాటు బేగంపేట, కూడవెల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ గజ్జెల సాయిలు, డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోలీసు రాజులు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ లింగాల రాజలింగారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ, సర్పంచ్ లక్ష్మియాదగిరి, ఉపసర్పంచ్ ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

తొగుట(దుబ్బాక): మండలంలోని కాన్గల్‌లో శనివారం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ ప్రేమల, ఉపసర్పంచ్ మల్లయ్య, ఏఎంసీ చైర్మన్ కొమురయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, ఏఎంసీ, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వమే ప్రతి గింజను కొంటుంది

దుబ్బాక: దౌల్తాబాద్ మండలం పరిధిలోని గొడుగుపల్లి, దొమ్మాట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను దౌల్తాబాద్, రాయపోల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఇప్ప లక్ష్మి, దౌల్తాబాద్ జెడ్పీటీసీ రణం జ్యోతి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పూజితవెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలక్ష్మినర్సమ్మ, ఏపీఎం కిషన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

దుబ్బాకటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు మల్లాయపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేశ్, కౌన్సిలర్ నిమ్మరజితగిరి ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్ యాదగిరి, రైతుబంధు కో–ఆర్డినేటర్ చల్లా శివకుమార్ ఉన్నారు.

శ్రమదానంతో జేపీఎస్‌ల శాంతియుత నిరసన

9వ రోజుకు చేరిన సమ్మె



కలెక్టరేట్ ఎదుట శ్రమదానం చేస్తున్న జేపీఎస్‌లు

సిద్దిపేటరూరల్: జేపీఎస్, ఓపీఎస్‌లు రెగ్యులర్ కోసం చేస్తున్న సమ్మెలో భాగంగా వినూత్నంగా శ్రమదానం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. శనివారం జేపీఎస్‌లు చేస్తున్న సమ్మె 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జేపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వంపై శాంతియుతంగా తమ సమస్య పరిష్కారం అయ్యేంతవరకు నిరసన వ్యక్తం చేస్తామన్నారు. సమ్మెలో భాగంగా రోజువారీగా వినూత్నంగా పలు రకాలుగా నిరసనలు వ్యక్తం చేస్తున్నామన్నారు. తమకు మద్దతుగా ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు సంఘీభావం తెలుపుతున్నందుకు ధన్యవాదాలు. తమది న్యాయమైన డిమాండ్ అని, ప్రభుత్వం మరోసారి పునరాలోచన చేసి తమను రెగ్యులర్ చేయాలి. దుబ్బాక మండలం పోతిరెడ్డిపేట సర్పంచ్ శంకర్, పలువురు నాయకులు సంఘీభావం తెలిపారు.

సమ్మెకు సర్పంచ్‌ల మద్దతు

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రొబేషనరీ పీరియడ్ ముగిసినా ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయకపోవడంతో సమ్మెబాట పట్టిన వారిని వెంటనే రెగ్యులర్ చేయాలని అక్కన్నపేట, గుడాటిపల్లి గ్రామాల సర్పంచ్‌లు ముత్యాల సంజీవ్‌రెడ్డి, బద్దం రాజిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట తొమ్మిది రోజులుగా చేస్తున్న పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు వారు సంపూర్ణ మద్దతు ప్రకటించి సమ్మెలో పాల్గొన్నారు. వారితో పాటు మండల అధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, చందు తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న అశోక్ తదితరులు

చేర్యాల(సిద్దిపేట): ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి, కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా నాయకుడు కత్తుల భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శ్రీకాంత్, నర్సిరెడ్డి, బానుష, యాదవ్వ, లక్ష్మి, కనకవ్వ, రజిత, రాజయ్య, రమేశ్, మల్లయ్య, పోచవ్వ తదితరులు పాల్గొన్నారు.

కూలీల డబ్బులు వెంటనే చెల్లించాలి

దుబ్బాక: ఉపాధి హామీ పథకంలో కూలీలు పనిచేసి ఏడాది గడుస్తున్నా కూలీలకు డబ్బులు చెల్లించకపోవడం దారుణమని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ అన్నారు. శనివారం కూలీలతో కలిసి రాయపోల్ ఎంపీడీఓ మున్నయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు, కూలీలు తదితరులున్నారు.

పెద్దమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



పట్నం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం పెద్దమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవాల్లో ప్యాక్స్ చైర్మన్ తన్నీరు శరత్‌రావు, ఏఎంసీ చైర్మన్ కచ్చు రాజయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ బోయినిపెల్లి నర్సింగారావు, నాయకులు గోపాల్‌కిషన్‌రావు, లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **గొల్ల, కురుమల సంక్షేమానికి ప్రాధాన్యం**

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం గొల్ల కురుమల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తుందని గొల్ల కురుమల సంఘం మండల అధ్యక్షుడు రాజుయాదవ్ అన్నారు. శనివారం చిన్నకోడూరులో మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం త్వరలోనే ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. గొల్ల కురుమలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. గత పాలకులు గొల్ల కురుమల సంక్షేమాన్ని విస్మరించారన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు సరితసంపత్, బండి శ్రీనివాస్, ఎంపీటీసీ బాలయ్య, నాయకులు పోచయ్య, పెద్దులు పాల్గొన్నారు.

◆ **ఆర్థికసాయం**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని అభయజ్యోతి మానసిక దివ్యాంగుల విద్యార్థులకు, పట్టణానికి చెందిన గండెసిరి కృష్ణమూర్తి, భారతమ్మల వివాహ వార్షికోత్సవం సందర్భంగా రూ.21వేల ఆర్థిక సాయంగా అలయన్స్ క్లబ్, వాసవీ క్లబ్ సిద్దిపేటల ఆధ్వర్యంలో శనివారం అభయజ్యోతి మానసిక దివ్యాంగుల పాఠశాల నిర్వాహకులకు అందించారు. శనివారం అభయజ్యోతి మానసిక దివ్యాంగుల పాఠశాలలో అలయన్స్ క్లబ్ చార్టర్ గవర్నర్ పెద్ది వైకుంఠం, నాగమణి దంపతులు, గండెసిరి కృష్ణమూర్తి, భారతమ్మ దంపతులు వివాహ వార్షికోత్సవాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మానసిక దివ్యాంగుల విద్యార్థులకు పండ్లు, బిస్కెట్స్, జ్యూస్, స్నాక్స్, తదితర ఆహార పదార్థాలను అందించారు.

◆ **వీవోఏల సమస్యలు పరిష్కరించాలి**

కొండపాక(గజ్వేల్): వీవోఏల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని వీవోఏల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు తలపాక కిష్టయ్య పేర్కొన్నారు. మండల కేంద్రమైన కొండపాకలోని వెలుగు కార్యాలయం ఎదుట కొనసాగుతున్న సమ్మెకు శనివారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా తలపాక కిష్టయ్య మాట్లాడుతూ.. సమ్మెకు దిగి 19 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల్‌నర్సయ్య, వీవోఏల సంఘం మండల నాయకులు శంకర్, మహాలక్ష్మి, నాగలక్ష్మి, రాములు, సందీప్, పద్మ, భాగ్యరాణి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

◆ **ఎంఈఓపై చర్యలు తీసుకోవాలి**

చేర్యాల(సిద్దిపేట): విద్యారంగ సమస్యలపై స్థానిక ఎంఈఓకు వినతపత్రం అందించేందుకు వారం రోజులుగా ఎంఈఓ కార్యాలయానికి వెళ్తున్నా ఏ ఒక్క రోజు కూడా అందుబాటులో లేని ఎంఈఓపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ చేర్యాల డివిజన్ కమిటీ అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి కోరారు. శనివారం ఎంఈఓ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ.. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన డీఈఓ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు శివ, రాకేశ్ తదితరులున్నారు.

◆ **క్షేత్ర పర్యటనలతో విజ్ఞానం పెంపు**

గజ్వేల్‌రూరల్: క్షేత్ర పర్యటనల ద్వారా విజ్ఞానం పెంపొందుతుందని గజ్వేల్ ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని తెలుగు, చరిత్ర విభాగాల ఆధ్వర్యంలో శనివారం వర్గల్‌లోని రుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయాన్ని విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయానికి సంబంధించిన వివరాలను అక్కడి పండితులు విద్యార్థులకు వివరించారు. అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్షేత్ర పర్యటనల ద్వారా వివిధ అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహనతో పాటు విషయ పరిజ్ఞానం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు విభాగం అధ్యక్షుడు డాక్టర్ వెల్దండి శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్, చరిత్ర విభాగ అధ్యక్షుడు గణపతిరావు, అధ్యాపకులు సాయికృష్ణ, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **బండి సంజయ్‌కి కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి**

హుస్నాబాద్: మంత్రి కేటీఆర్ శుక్రవారం హుస్నాబాద్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ బహిరంగ సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై వ్యక్తిగతంగా విమర్శించడాన్ని బీజేపీ నాయకులు ఖండించారు. మంత్రి వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ శనివారం సాయంత్రం అంబేడ్కర్ చౌరస్తాలో మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. వెంటనే మంత్రి సంజయ్‌కి క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోశాధికారి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సతీశ్, నాయకులు వేణుగోపాల్‌రావు, జైపాల్‌రెడ్డి, నరేశ్, తోట సమ్మయ్య, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

◆ **16న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం**

సిద్దిపేటకమాన్: హైదరాబాద్‌లో ఈ నెల 16వ తేదీన రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు జాతీయ అధ్యక్షుడు పాపన్న తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. అర్హులైన వారికి దళితబంధు ప్రకటించాలన్నారు. 16న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో శ్రీనివాస్, రాజేందర్, పరశురాములు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **మేడే వారోత్సవాలను విజయవంతం చేయండి**

కొమురవెల్లి(సిద్దిపేట): మేడే వారోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో మేడే వారోత్సవాల్లో భాగంగా ఆమరవీరుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాంసాగర్, అయినాపూర్ సర్పంచ్‌లు రవీందర్, రమణారెడ్డి, బక్కెల్లి బాలకిషన్, వుల్లంపల్లి సాయిలు, కర్రోల్ల ఎల్లయ్య, రవీందర్ పాల్గొన్నారు.

◆ **విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి**

గజ్వేల్‌రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో వారిలో కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టినట్లవుతుందని ప్రజ్ఞాపూర్ ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధునాల శ్రీనివాస్ పేర్కొన్నారు. గత నెల 25 నుంచి ఈ నెల 6వరకు పాఠశాలలోని రూం టూ రీడ్ లైబ్రరీ ప్రోగ్రామ్‌లో భాగంగా విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు రోల్‌ప్లేస్ చేయడం, సొంతంగా కథను రాయడం నేర్చుకున్నారని, ఈ సమ్మర్ క్యాంప్‌లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రాజెక్టు వర్క్‌లను పూర్తి చేసినట్లు తెలిపారు.

పీఎం మోదీ, సంజయ్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న శ్రీరాంచక్రవర్తి తదితరులు

హుస్నాబాద్: ప్రధాని మోదీ, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర హౌజ్ ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి డిమాండ్ చేశాడు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రధానిని విమర్శించడం నీస్థాయికి తగదన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు అభద్రత భావంతో బీజేపీ నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారన్నారు. ఎలకతుర్తి నుంచి సిద్దిపేట వరకు జాతీయ రహదారి నిర్మాణానికి మోదీ శంకుస్థాపన చేశారని, రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో జరిగే అభివృద్ధి కేంద్ర నిధులను మరిచిపోవద్దన్నారు. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో ఎలాంటి అభివృద్ధి జరిగిందో, హుస్నాబాద్‌లో ఎలాంటి అభివృద్ధి జరిగిందో చర్చకు సిద్ధమన్నారు. మంత్రి కేసీఆర్ చేతుల మీదుగా మున్సిపల్ దుకాణ సముదాయం ప్రారంభించారని, దీనికి ఖర్చు అయిన రూ.1.25కోట్లు కేంద్ర నిధులేనని శ్రీరాంచక్రవర్తి అన్నారు. సమావేశంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, కో కన్వీనర్ వేణుగోపాల్‌రావు, మండల అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, తోట స్వరూప, కోమటి సత్యనారాయణ, సంపత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలుని కల్యాణం

వర్గల్‌లో ఆధ్యాత్మిక పరిమళం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

వర్గల్(గజ్వేల్): బాజాభజంత్రీలు, మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛారణలు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య వర్గల్ వేణుగోపాలుని కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రుక్మిణీ, సత్యభామలను స్వామివారు పరిణయమాడే మహోత్సవ ఘట్టం బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం రాత్రి ఆవిష్కృతమైంది. ఆలయ కల్యాణ మండపంలో రాత్రి 10 గంటలకు ప్రారంభమైన వేణుగోపాలుని కల్యాణ వేడుక అర్ధరాత్రి ఒంటి గంట వరకు కొనసాగింది. కల్యాణోత్సవంలో భాగంగా అర్చకులు స్వామివారికి, అమ్మవార్లకు ఎదుర్కోలు నిర్వహించారు. స్వామివారికి యజ్ఞోపవిత ధారణ చేశారు. సుముహూర్త వేళ స్వామివారు రుక్మిణి, సత్యభామ అమ్మవార్ల మెడలో మంగళసూత్ర ధారణ చేశారు. కల్యాణోత్సవాన్ని తిలకించిన భక్తజనులు పరవశించిపోయారు. కల్యాణ వేదికపై స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకొని కట్నకానుకలు సమర్పించుకున్నారు. కల్యాణ వేడుకతో వర్గల్‌లో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఈ సందర్భంగా వర్గల్‌లో భక్తిపారవశ్యం అలుముకున్నది. శనివారం సుదర్శన హోమం జరిగింది.

బీటీరోడ్డు పనుల పరిశీలన



పెద్దమ్మ ఆలయంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావును సన్మానిస్తున్న నిర్వాహకులు

తొగుట(దుబ్బాక): మండలంలోని చందాపూర్ రోడ్డు పనులను దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు శనివారం పరిశీలించారు. వాగుగడ్డ నుంచి చందాపూర్ మీదుగా కల్గూర్ పెద్దమ్మ ఆలయం వరకు బీటీరోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఎమ్మెల్యే రోడ్డు పనులు పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ డీఈఈ వెంకటేశ్‌తో మాట్లాడి పనులు నాణ్యతతో చేపట్టాని సూచించారు. అనంతరం కాన్గల్ పెద్దమ్మ కల్యాణ ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం కాన్గల్, గుడికందుల గ్రామాల్లో మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రం, బీజేవైఎం జిల్లా మాజీ అధ్యక్షుడు విభీషన్‌రెడ్డి, నాయకులు స్వామిరెడ్డి, పరమేశ్, చందుగౌడ్, నరేశ్‌గౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ మాలాధారణ స్వాములకు భిక్ష



స్వాములకు భిక్ష వడ్డిస్తున్న వంశీధర్‌రావు



హుస్నాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట్): పట్టణ కేంద్రంలోని వైశ్యాభవన్‌లో కేఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్‌రావు ఆధ్వర్యంలో హనుమాన్ స్వాములకు భిక్ష(అన్నప్రసాద) కార్యక్రమం నిర్వహించారు. వంశీధర్‌రావు ముందుగా స్వామివారికి అభిషేకం, అనంతరం వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన నిర్వహించిన మాలధారులకు భిక్ష వడ్డించారు. అనంతరం స్వాములతో కలిసి వంశీధర్‌రావు సహపంక్తి భోజనం చేశారు.

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని సదానందాశ్రమంలో హనుమాన్ మాలాధారణ స్వాములకు బీఆర్‌ఎస్ నాయకుడు పసులకాడి రమేశ్ ఆధ్వర్యంలో శనివారం భిక్ష (అన్నదానం) కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని స్వాములు అధిక సంఖ్యలో భిక్షలో పాల్గొన్నారు. అంతకు ముందు ఆశ్రమంలో స్వాములు ప్రత్యేక పూజలతో పాటు, సాంస్కృతిక భజన కార్యక్రమాలు నిర్వహించారు.

హుస్నాబాద్: పట్టణంలో శనివారం హనుమాన్ స్వాములు ర్యాలీ నిర్వహించారు. ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో ఊరేగిస్తూ హనుమాన్ భక్తి గీతాలతో నృత్యాలు చేశారు. హనుమాన్ నామస్మరణతో పలు వీధులు మార్మోగాయి.

వైభవంగా దుబ్బరాజేశ్వరస్వామి రథోత్సవం



చిన్నకోడూరు(సిద్దిపేట): రథం ఊరేగింపులో గ్రామస్తులు



దుబ్బాకటౌన్: దుబ్బరాజేశ్వరస్వామి రథాన్ని ఊరేగిస్తున్న భక్తులు

దుబ్బాకటౌన్: చౌదర్‌పల్లి దుబ్బరాజేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయం నుంచి తెల్లవారుజామునే ప్రారంభమైన స్వామివారి ఊరేగింపు ప్రధాన వీధుల గుండా కొనసాగించారు. రథోత్సవం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మంగళహారతులు కొబ్బరికాయలతో స్వామివారికి స్వాగతం పలికారు. అదేవిధంగా ఆలయంలో స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అష్టోత్తర శతకళశాభిషేకం, ఆంజనేయ స్వామికి మన్యుసుక్తాభిషేకం నిర్వహించారు. ఆకుపూజ, ఔపోసన, రుద్రహవనం, మహాపూర్ణాహుతి, బలిహరణం, మండప ఉద్వాసన, ధ్వజారోహణం, త్రిశూల స్నానం, మహానివేదన, పుష్పోత్సవం,అన్నప్రసాద కార్యక్రమాలు జరిగాయి.

చంద్లాపూర్‌లో..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్ రంగనాయకస్వామి రథోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ముందుగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళహారతులతో, స్వామివారి నామస్మరణలతో రథోత్సవం గ్రామంలో కొనసాగింది.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



ఎంపీడీఓ మున్నయ్యకు తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న సర్పంచ్‌లు

దుబ్బాక: గ్రామాన్ని అభివృద్ధి చేయాలని పనులు చేపట్టి బిల్లులు రాక అప్పుల పాలవుతున్నామని పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయకపోతే సర్పంచ్‌లందరం మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని సర్పంచ్‌ల ఫోరం రాయపోల్ మండల అధ్యక్షుడు వెంకట నరసింహారెడ్డి అన్నారు. శనివారం ఎంపీడీఓ మున్నయ్యకు సర్పంచ్‌లు తీర్మాన పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ అభివృద్ధి పథకాలు ప్రారంభించినా వాటిని అమలు చేసి గ్రామాలను అభివృద్ధి చేయడానికి లక్షల రూపాయలు అప్పు తెచ్చి పథకాలు అమలు పరుస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సర్పంచ్‌ల బాధలు అర్థం చేసుకొని పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చంద్రశేఖర్, స్వామి, తదితరులున్నారు.